క్లుప్తంగా

బస్సు లారీ ఢీ.. తప్పిన ప్రమాదం



మరికల్: ఆగిఉన్న లారీని బస్సు ఢీకొట్టిన ఘటన గురువారం ఎలిగండ్ల స్టేజీ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గోవా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సు మరికల్ మండలం ఎలిగండ్ల స్టేజీ దగ్గరకు రాగానే ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో పది మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

స్థలం విషయంలో దాడి



ధన్వాడ: మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి ఇతరులు దాడి చేశారు. మాజీ సర్పంచ్ రాములు తన పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు దిమ్మె నిర్మిస్తుండగా ఇది మీ స్థలం కాదు అంటూ రాములు భార్య మొగులమ్మపై దాడి చేశారు. దాడి నేపథ్యంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రాములు తెలిపారు.

బాధితురాలికి బ్యాగు అందజేత



మక్తల్: మండలంలోని పస్పుల గ్రామంలో దత్తాత్రేయస్వామి దర్శనం కోసం వచ్చిన ముంబైకి చెందిన శోభమ్మ అనే మహిళ ఆటోలో వస్తున్న క్రమంలో బ్యాగు పోగొట్టు కుంది. మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఆమె సెల్‌ఫోన్ ఆధారంగా లొకేషన్ ట్రేస్ చేసి గుడిగండ్ల గ్రామానికి చెందిన ఆశప్ప దగ్గర బ్యాగును స్వాధీనం చేసుకుని ఆమెకు అందజేశారు. బ్యాగులో రూ.4 వేల నగదు, సెల్‌ఫోన్ ఉన్నట్లు బాధితురాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకి మండల కమిటీ ఎన్నిక



మరికల్: వాల్మీకి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు, యూత్ మండల అధ్యక్షుడిగా రఘు, కార్యవర్గ సభ్యులను జిల్లా వాల్మీకి కమిటీ నాయకులు ఎన్నుకున్నారు. అనంతరం రెండు కమిటీల సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చంద్రప్ప, నర్సిములు, రాములు, రవివర్మ, వెంకటేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు నర్వ తైబజార్ వేలం

నర్వ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ తైబజార్ వేలం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. వారంతపు సంత జరిగే రోజు మార్కెట్‌లోకి వాహనాలు రాకుండా బారికేడ్లు పెట్టి వాహనాలు బైపాస్ చేయుట గుత్తేదారులు బాధ్యతన్నారు. నిబంధనల ప్రకారం 1-4-2025 నుంచి రుసుం వసూలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నర్వ: సింగిల్ విండో సర్వసభ్య సమావేశం కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సీఈఓ ఉదయ్ ఒక ప్రకటనలో తెలిపారు. విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశంలో 2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించిన నివేదికపై చర్చిస్తామన్నారు. సమావేశానికి మండల సింగిల్ విండో పాలకవర్గ డైరెక్టర్లు, మండల ప్రజాప్రతినిధులు, రైతులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు


మురహర్‌దొడ్డి శివారు కల్లాలో నిల్వ ఉంచిన వరి ధాన్యం

- వారం రోజులుగా పొలాల్లోనే ధాన్యపు రాశులు
- ధాన్యం కొనుగోలు చేయాలని వరి రైతుల వేడుకోలు

కృష్ణా: జిల్లాలోనే వరి సాగు ఎక్కువగా చేసే మండలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వారం రోజులుగా పొలాల్లోనే వరి ధాన్యాన్ని రాశులుగా పోసి విక్రయించేందుకు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పక్క రాష్ట్రాలకు విక్రయం..

కృష్ణా మండలంలో పండే వరి ధాన్యానికి విలువ కూడా అధికంగా ఉంటుంది. అందుకే పక్కన ఉన్న కర్ణాటకలోని రాయచూర్ మార్కెట్ సిబ్బంది, మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రైతుల పొలాల్లోకి వచ్చి ధాన్యాన్ని విక్రయిస్తుంటారు. కాగా ప్రస్తుతం వరికి ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటూ బోనస్ కూడా ఇస్తుండడంతో రైతులు ప్రైవేటు వ్యక్తులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సగానికి పైగా కోతలు పూర్తి..

మండలంలోని నది తీర ప్రాంతాల్లోని గుడెబల్లూర్, ముడుమాల్, మురహర్‌దొడ్డి, గుర్జాల్, తంగిడి, కుసుమర్తి, సూకూర్‌లింగంపల్లి గ్రామాల్లో సగానికి పైగా వరికోతలు పూర్తయ్యాయి. అయినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వాతావరణం మేఘావృతం కావడంతో అకాల వర్షాలు వస్తే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 11, 500 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 36 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుని మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

> **పక్షం రోజుల్లో ఏర్పాటు చేస్తాం..**
>
> 
>
> మండలంలో మొత్తం 5 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పక్షం రోజుల్లో ఏర్పాటు చేస్తాం. రైతులు ప్రైవేటు వ్యక్తులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే బోనస్ డబ్బులు పొందేందుకు అవకాశం ఉంది.
>
> – సుదర్శన్‌గౌడ్, వ్యవసాయ అధికారి

రైతులను పట్టించుకోని ప్రభుత్వం


ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ధన్వాడ: పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జట్రం గోవర్ధన్‌గౌడ్ అన్నారు. గురువారం ధన్వాడ మండలంలోని మందిపల్లి గ్రామం వద్ద ఎండిన వరి పంటలను రైతులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలాలు ఎండి రైతులు కష్టాలు పడుతుంటే ఇప్పటి వరకు ఎండిన వరి పంటలను ప్రభుత్వం పరిశీలించలేదని మండిపడ్డారు. దాదాపు మందిపల్లి గ్రామ శివారులోనే 100 ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయిందన్నారు. ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం అందజేయాలన్నారు. వెంటనే రైతులను అదుకోవాలని లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రయ్య, ఉమేష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విభిన్న వేషధారణల్లో ఆకట్టుకున్న విద్యార్థులు


నిడుగుర్తి పాఠశాలలో వివిధ వేషధారణల్లో విద్యార్థులు

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి ప్రభుత్వ పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా గురువారం విద్యార్థులు హర్యానా వేషధారణల్లో ఆకట్టుకున్నారు. బాలబాలికలు హర్యానా సాంప్రదాయబద్ధంగా వేషధారణతో పాఠశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసు మాట్లాడుతూ.. మన దేశ సంస్కృతి సంప్రదయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులకు వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలపై వివరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, శ్రీనివాసరావు, హిదయతుల్లా, మహ్మద్‌హాకీ, ధనుంజయ, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి


జాజాపూర్‌లో విద్యార్థుల స్థాయి పరిశీలిస్తున్న బృంద సభ్యులు

నారాయణపేట రూరల్: ఏఐ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రస్థాయి బృంద సభ్యులు అన్నారు. మండలంలోని కొల్లంపల్లి, జాజాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో రాష్ట్రస్థాయి బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో నిర్వహిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) బోధనపై విద్యార్థుల స్థాయిలను తెలుసుకున్నారు. ముఖ్యంగా గణితం, తెలుగు సామర్థ్యాలు, కంప్యూటర్ లాగిన్ విధానం పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు పదాలను చదివించి వారి పురోగతిని సమీక్షించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అవంతి, శరణ్, ఆకాష్, ఏఎంఓ విద్యాసాగర్, డీఎస్‌ఓ భానుప్రకాష్, ఎంఈఓ బాలాజీ, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు భూమిపూజ


పైపులైన్ పనులకు భూమిపూజ చేస్తున్న ఏఈ సాగర్

మరికల్: కేజీబీవీ విద్యార్థుల తాగునీటి కష్టాలను దృష్టిలో ఉంచుకొని గ్రామస్తులు సహకరించాలని మిషన్ భగీరథ ఏఈ సాగర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కేజీబీవీ పాఠశాల తాగునీటి అవసరాలను తీర్చేందుకు పైపులైన్ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. కేజీబీవీ పాఠశాలకు గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌కు కనెక్షన్ ఇస్తే తమ గ్రామానికి నీళ్ల సమస్య వస్తుందని గ్రామస్తులు నిరాకరించారు. అధికారులతో పాటు నాయకులు గ్రామస్తులకు నచ్చచెప్పడంతో కేజీబీవీకి పైపులైన్ పనులు ప్రారంభించారు. రూ. 6 లక్షల నిధులతో 1320 మీటర్ల పైపులైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో హరీష్, రవిగౌడ్, లింగంగౌడ్, రఘు, రామకృష్ణ, శ్రీను, గోపాల్, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అంసెబ్లీ సాక్షిగా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ విషయంలో మాపై చేసిన వ్యాఖ్యల్లో ఎంతవరకు నిజం ఉందో అనే విషయంపై ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. వరుసగా రెండు రోజుల పాటు విద్యార్థులకు పురుగుల అన్నం రావడం అబద్ధమా అని ప్రశ్నించారు. రెండో రోజు పాఠశాల సందర్శనకు వచ్చిన సందర్భంలో మళ్లీ పురుగుల అన్నం రావడంతో విద్యార్థులు పడుతున్న ఆకలి బాధను అర్థం చేసుకొని సొంత డబ్బులతో బియ్యం తెప్పించి వడ్డించి వారికి తిన్నిపించడం నేరమా అన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం స్థానిక ఎమ్మెల్యేకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందన్నారు. మేము మొదలు పెట్టిన పనులు ఇప్పుడు కొనసాగిస్తున్నారని, సొంతగా చేసిన పనులను చూయించాలని సవాలు విసిరారు. కర్ణాటక రాష్ట్రంలో కృష్ణ, భీమా నదులపై అక్రమంగా నిర్మిస్తున్న లిఫ్టులు, డ్యాంలను నిలిపివేసే దమ్ములేదా అన్నారు. అవగహన లేని పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని ఇప్పటికైనా విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి పెడితే సంపూర్ణంగా మద్దతు ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పల్లెమారెప్ప, డీజిల్ సాయిబన్న , బసంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ పాకెట్ల పంపిణీ



మాగనూర్: మండల కేంద్రంలోని ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గురువారం ఓఆర్‌ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ మేట్ కుర్వ మారెప్ప మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వడదెబ్బ తగలకుండా కూలీలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓఆర్‌ఎస్ పాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కూలీలు త్వరగా వచ్చి అంతే త్వరగా పనులు ముగించుకోవాలని సూచించారు. వారికి కావాల్సిన అన్ని రకాల వసతులు పని ప్రదేశాల్లో కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ బోరే దిక్కు



కోస్గిరూరల్: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి చేస్తుంటే.. అధికారుల నిర్లక్ష్యం వల్ల మిషన్ భగిరథ నీరు అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని ముక్తిపాడ్ గ్రామంలో మూడు రోజులుగా మిషన్ భగిరథ నీరు రాకపోవడంతో వ్యవసాయ బోరు నీరే దిక్కయిందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ బోర్లు తమ దాహార్తిని తీరుస్తున్నాయని తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



మద్దూరు: హిందీ ప్రచార సభ హైదరాబాద్ వారు నిర్వహించిన ప్రతిభా పోటీలో మద్దూరు బాలిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పారిజాత విశిష్ట మహిళా ప్రతిభ పురస్కార్ అవార్డు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో హిందీ ప్రచార సభ రాష్ట్ర కార్యదర్శి ఏకే రాజు ప్రశంసాపత్రాన్ని అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలకిష్టప్ప, హెచ్‌ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత, తైబజార్ వేలం వాయిదా

కోస్గిరూరల్: ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణయాత్మక రుసుం రాని కారణంగా కోస్గి మున్సిపాలిటీలో జరిగే పశువుల సంత, తైబజార్ వేలాన్ని కలెక్టర్ అదేశాల మేరకు వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యలయం ఆవరణలో జరిగిన వేలంలో పశువుల సంత ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 89 లక్షలు కాగా రూ.69 లక్షలు, తైబజార్ రూ.41 లక్షలకు గాను రూ.31 లక్షలు ధర పలికినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రాని కారణంగా శనివారానికి వేలం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం


బోగారంలో భూమి పూజలో తిరుపతిరెడ్డి

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, కడా చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సర్జఖాన్‌పేట్ గ్రామం నుంచి పోతిరెడ్డిపల్లి-గుండాల్ వరకు రూ.7 కోట్ల 15 లక్షల నిధులతో బీటీరోడ్డు, గుండుమాల్ మండల పరిధిలోని బోగారం నుంచి అమ్లీకుంటా- ముదిరెడ్డిపల్లి వరకు రూ.9 కోట్ల 45 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వార్ల విజయ్ కుమార్, ఎంపీడీఓ శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి, బీంరెడ్డి, మధుకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం

మరికల్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పూసల్‌పహాడ్ గ్రామంలో గురువారం ప్రత్యేక అధికారి సుధాకర్‌రెడ్డితో కలిసి సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు కింద రూ. 13 లక్షల వ్యయంతో 600 మీటర్ల సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో పల్లెలో ఎలాంటి ప్రజా సమస్యలు లేకుండా పరిష్కరించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వీరన్న, హరీష్, కృష్ణారెడ్డి, సత్యన్న, రామకృష్ణారెడ్డి, మల్లారెడ్డి, రామకృష్ణ, రవి పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి గ్రామంలో రూ.5 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రంగారెడ్డి, లక్ష్మమ్మ, తాయప్ప, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మద్దూరు: కొడంగల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, అందరి బాగుకోసం కృషి చేస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మండంలోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్లలో కడా నిధుల కింద రూ. 2.60 కోట్లతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం, దోరేపల్లి నుంచి జాధరామ్‌పల్లికి రూ.111.27 లక్షలతో రోడ్డు విస్తరణ, పల్లెర గేట్ నుంచి చింతల్‌దిన్నే మీదుగా జాధారామ్‌పల్లి వరకు 9.5 కోట్లలతో బీటీరోడ్డు పనులు, హన్మనాయక్‌తండాలోని సాలోనిగడ్డ తండా నుంచి అబ్రానాయక్ తండా వరకు రూ.3.9 కోట్లతో బీటీరోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కడా అధికారి వెంటక్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

మక్తల్: పట్టుదల ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలమని రాష్ట్ర సైక్లింగ్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం అన్నారు. గురువారం మండలంలోని సంగంబండ సాంఘీక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ స్థాయిల్లో 10 మంది, రాష్ట్ర స్థాయికి 32 మంది క్రీడాకారులు, దాదాపు 42 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ చంద్రకళ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు గోపాల్‌ను సన్మానించారు. జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, పీఈటీలు శ్రీలత, దేవకమ్మ, కౌసల్య, సుధాకర్‌రెడ్డి, లియాకత్, వంశీకృష్ణ, రవికుమార్, తిరుపతమ్మ, పవిత్ర, శారదా, ప్రియాంక విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక సమావేశాలు జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు

మరికల్: వ్యవసాయ కార్మిక రాష్ట్రస్థాయి సమావేశాలు జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. మండల కేంద్రంలో గురువారం సంఘ జిల్లా కార్యదర్శి గోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పనులకు రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. కార్మికుల సమస్యల సాధన కోసం ఏప్రిల్ 26, 27న మరికల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంజనేయులు, గోవింద్‌రాజు, నరహరి, పవన్, భీమ్‌రాజ్, మల్లయ్య, లక్ష్మమ్మ, రాజమల్లేష్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయికులు

మద్దూరు: వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వడగండ్ల వానకు 15 రోజుల్లో చేతికొచ్చే పంట నేలపాలయిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెవెన్యూ, వ్యవసాయాధికారుల చేత సర్వే చేయించి ఎకరాకు రూ. 50 వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఏఈఓ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి యాదగిరి, నాయకులు చెన్నారెడ్డి, కొండ నర్సిములు, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంచముఖి అంజన్న బ్రహ్మోత్సవాలు

కోయిల్‌కొండ: మండలంలోని వీరంపల్లిలో శ్రీపంచముఖి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజున దీపారాధన, పుణ్యాహవాచనం, అభిషేకం, హోమం, శనివారం తెల్లవారుజామున రథోత్సవం, పల్లకీ సేవ, ఊరేంగిపు కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకుడు వెంకటేష్ తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కేసులు పెట్టడం ఇదెక్కడి న్యాయం

కోస్గిరూరల్: కాంగ్రెస్ నాయకులు చేసే అన్యాయాలపై ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెట్టడం ఇదెక్కడి న్యాయమని బీజేపీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు రమేష్ గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిపై వాట్సాప్‌లో పోస్టు పెట్టిందని బీజేపీ మహిళా మోర్చా నాయకురాలుపై కేసు పెట్టడం అన్యాయమన్నారు. కేసులు, జైలుకు భయపడేది లేదని పేర్కొన్నారు.